ఇంటింటికీ జాతీయ పతాకాల పంపిణీ

రాజేంద్రనగర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ జాతీయ జెండాలను ప్రజలకు అందించారు. మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆర్మీ రిటైర్డ్ మామిడిపల్లి నర్సింహారెడ్డిని ఆయన ఘనంగా సన్మానించి సత్కరించారు. బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, నర్సింహ్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజావర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, భూపతిరెడ్డి, టి.చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, పాండుయాదవ్, రామకృష్ణ, ఉత్తమ్, ఉదయ్, కిషోర్, రాజ్‌కుమార్, అవినాస్, మల్లికార్జున్, మాజర్, సి.హెచ్.ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి, మోహమ్మద్ షకీల్, అనిల్, రాజు, మహేష్, భరత్ పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కావడి భక్తులతో సందడిగా మారిన మచిలేశ్వర స్వామి ఆలయం



మంచిరేవులలో కావడి భక్తుల జాగరణ

మణికొండ: ప్రతి సంవత్సరం శ్రావణం, కార్తీక మాసాలలో హైదరాబాద్‌లోని బేగం బజార్ నుంచి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శ్రీ మచిలేశ్వర ఆలయం వరకు మార్వాడీ భక్తులు కావడిలను మోసుకుని కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.అందులో భాగంగా ఆదివారం రాత్రి దేవాలయానికి చేరుకుని రాత్రంతా ప్రత్యేక భజనలు, కీర్తనలతో జాగరణ నిర్వహించారు.సోమవారం స్వామి వారిని మరో మారు దర్శనం చేసుకుని తిరుగుపయమన్నారు.వేలాది మంది దేవాలయానికి చేరుకోవటంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



శంషాబాద్ రూరల్: వ్యాపారులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్‌కుమార్ సూచించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సందడిగా 'ఇన్ఫిన్యుటీ 2కే23'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి దుర్గా కన్వెన్షన్‌లో సోమవారం గాయత్రీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల ఇన్ఫిన్యుటీ 2కే23 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఇండియన్ ఐడల్ ఫేమ్ దేవికాశర్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశభక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ, ఉన్నత విద్య, సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాలు ఆలోచింపజేశాయి. పాటలకు అనుగుణంగా విద్యార్థులు చేసిన నృత్యాలకు విద్యార్థినులంతా తోడై ఆడిపాడారు. డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసి జాతీయ, రాష్ట్రస్థాయి పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు బహుమతులను పదానం చేశారు. ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, హారికారెడ్డి, భార్గవరెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన పాల్గొన్నారు.

జింక, దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

శంషాబాద్: జింక, దుప్పి మాంసాలకు అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురిని శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలోని ఓ షెడ్డు ప్రాంతలో జింక, దుప్పి మాంసాలను విక్రయిస్తునే సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు.మాంసం విక్రయాల్లో ప్రధాన సూత్రధారిగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సరస్వతీపురం గ్రామానికి చెందిన బుసరమోని వెంకటేష్(35), మాంసాన్ని సరఫరా చేసే నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఎరుగొల్లపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీను (37), కందుకూరు మండలం లేమూరు గ్రామానికి చెందిన పులికరుణాకర్(35) అదుపులోకి తీసుకున్నారు. వీరు జింక మాంసాన్ని రూ. 2 వేలు, దుప్పి మాంసాన్ని రూ. 3 వేలు కేజీ చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం . నిందితుల నుంచి రెండు కేజీల జింక మాంసం, 14 కేజీల దుప్పి మాంసంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జింక, దుప్పిలను వీరు ఎక్కడ వేటాడారు అనేదానిపై పూర్తి దర్యాప్తు కోసం వన్యప్రాణి చట్టం ప్రకారం వీరిపై కేసులు నమోదు చేసేందుకు ఆర్‌జీఐఏ పోలీసులు అటవిశాఖ అధికారులకు లేఖలు రాశారు.

బండ్లగూడలో శాంతి ర్యాలీ

బండ్లగూడ: మణిపూర్ హింసాకాండకు వ్యతిరేకంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ, క్యాండిల్ మార్చ్‌ను నిర్వహించారు. అన్ని చర్చిల పాస్టర్లు, ఫాదర్లు, బిషప్‌లు ఆయా సంఘాల సభ్యులు శాంతిర్యాలీలో పాల్గొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని చర్చి డినామినేషన్ల నుంచి కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కె.జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ, క్యాండిల్ మార్చ్‌లను నిర్వహించారు. హైదర్షాకోట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి ర్యాలీ ప్రారంభించారు. కాళీమందిర్ సమీపంలోని షాదాన్ కళాశాల నుంచి ఆర్మీ పబ్లిక్ స్కూల్, సన్‌సిటీ వరకు ర్యాలీ చేపట్టారు. మణిపూర్‌లోని హింసాకాండకు గురైన వారికి సంఘీభావం తెలుపుతూ 500మందికిపైగా క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు పాల్గొని మద్దతు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి.

రాజేంద్రనగర్‌కు రూ. వెయ్యి కోట్లు ఇవ్వాలి

టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్

శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కోకాపేట, బుద్వేల్ ప్రాంతాల్లోని భూములను వేలంపాటలో అమ్ముకుని సర్కారు రూ. 8 వేల కోట్లకు పైగా ఖజానాలో వేసుకున్నా నియోజకవర్గ అభివృద్ధికి పైసా కూడా ఇవ్వకపోవడం దారుణమని టీపీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ప్రశ్నించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అసెంబ్లీలో ఒక్కసారైనా నోరు విప్పిన దాఖలాలున్నాయా అని ఆయన ప్రశ్నించారు. పాలన చేతగాని సర్కారు ప్రభుత్వ భూములను వేలం వేసుకుని డబ్బులు పోగేసుకుంటున్నదన్నారు. ప్రధాన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్ యాదవ్, శేఖర్‌యాదవ్, నాయకులు శ్రీధర్ యాదవ్, సంజీవ్, ప్రభు, ప్రసాద్, రాఖీ, చందుయాదవ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. సోమవారం 6, 7, 8వ డివిజన్‌లలో చెత్త సేకకరణ, స్వీపింగ్ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. కార్మికులు ప్రతి రోజూ స్వీపింగ్ నిర్వహించి చెత్తాచెదారాలను తొలగిస్తున్న ప్రజలు తిరిగి చెత్తను వేయడం సరికాదన్నారు. చెత్తాచెదారాలు వేస్తే దుర్వాసన వ్యాపిస్తుందన్నారు. దీని కారణంగా అనేక రోగాలు వస్తాయన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితేఅక్కడ వేయకుండా చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. చెత్త సేకరణ కార్మికులు బస్తీలు, కాలనీలకు వచ్చి చెత్తను తీసుకుంటారన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసిఅందించాలని సూచించారు. 7వ డివిజన్ నాయకులు పాపయ్యయాదవ్ డ్రైనేజీ సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే ఆయన డీఈఈతో మాట్లాడి డ్రైనేజీ సమస్యను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పద్మశ్రీహిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కిషోర్‌రెడ్డి, విక్రమ్, సావర్కర్, ఉమామహేశ్వర్, సుమన్, రాజశేఖర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు లక్ష్మీనారాయణ, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గులాం హుస్సేన్

అత్తాపూర్: కల్లు కంపౌండ్‌లో మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులియాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన గులాం హుస్సేన్(35) స్థానికంగా ఉన్న కల్లు దుకాణంలో తాగుతూ రోడ్లపై తిరుగుతుంటాడు. జూలై 30వ తేదీన అత్తాపూర్ నుంచి రాంబాగ్ వెళ్లే రహదారిలో ఉన్న కల్లు కంపౌండ్‌లో కల్లుతాగడానికి వచ్చాడు. కల్లు దుకాణంలోనే గులామ్ హుస్సేన్ అనుమానాస్పందంగా మృతి చెందాడు. గమనించిన కంపౌండ్ యజమాన్యం మృతి చెందిన గులామ్ హుస్సేన్ మృతదేహాన్ని ఇద్దరు వ్యక్తులు మోటర్ సైకిల్‌పై తీసుకువెళ్లి మూసీ నదిలో పడేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించిన గులామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులు కంపౌండ్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలులేకపోవడంతో సహజ మరణమే అని పోస్టుమార్టం రిపోర్టులో వచ్చిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు రావాల్సి ఉందన్నారు. మోటార్ సైకిల్‌పై గులామ్ హుస్సేన్ మృతదేహాన్ని తరలించిన ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరనే విషయాన్ని వాహనం నెంబర్ ఆధారంగా గుర్తించే పనిలో ఉన్నామని పోలీసులు వివరించారు.

కుంటలోకి దిగి యువకుడి గల్లంతు

శంషాబాద్ రూరల్: నీటి కుంటలోకి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. మండలంలోని కేకే బస్తీ శివారులో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ సమాచారం మేరకు... గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన దలాయి బుజ్జి తన కొడుకు తేజ(19) పాటు మరికొంత మందితో కలిసి మండలంలోని కేకే బస్తీలో నివాసముంటూ కూలీ పని చేస్తున్నారు. తేజ, తన సమీప బంధువు జేమ్స్‌తో కలసి ఆదివారం మధ్యాహ్నం కొత్తూరు వెళ్లారు. అక్కడ మద్యం సేవించారు. తిరిగి కేకే బస్తీకి వచ్చిన తర్వాత బహిర్భూమి కోసం సమీపంలో ఉన్న పెరుమాళ్ల కుంట వద్దకు వెళ్లాడు. కుంటలోకి దిగిన అతను నీటిలో మునిగిపోయాడు. గల్లంతైన ఇతని కోసం సోమవారం ప్రత్యేక బృందాలతో పడవ సాయంతో కుంటలో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.